క్లుప్తంగా

డైరెక్టర్ వేదకుమారికి ఎంపీ కోటగిరి అభినందన



డైరెక్టర్ వేదకుమారిని అభినందిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మవారు ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి నియమితులు కావడం సంతోషంగా ఉందని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఎంపీ శ్రీధర్‌ను దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, డైరెక్టర్ వేదకుమారి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావం, చిత్తశుద్ధితో సేవలందిస్తూ నిరంతరం కష్టపడేవారికి ఉన్నత పదవులు లభిస్తాయనడానికి వేదకుమారి నియామకం నిదర్శనమన్నారు.

19 నుంచి ఢిల్లీలో జాతీయస్థాయి శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ నత్తానియేల్

దెందులూరు: జాతీయస్థాయిలో ఢిల్లీలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే అంశాలపై నిర్వహించనున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమానికి గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ నత్తానియేల్ ఎంపికయ్యారు. బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యాయామ విద్యలో భాగంగా నాయకత్వపు లక్షణాలు పెంపొందించే శిక్షణ, వ్యాయామ కళాశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, నూరు శాతం విద్యాభివృద్ధి, సత్ఫలితాల సాధనపై శిక్షణ ఉంటుందని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తమ కళాశాల ప్రిన్సిపల్ జాతీయ స్థాయి శిక్షణకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.


ఆకట్టుకున్న పౌరాణిక నాటకం



రామాంజనేయ యుద్ధం
పౌరాణిక నాటకంలోని ఒక సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి, స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం కైకలూరుకు చెందిన ఘంటాల బసవయ్య ఘంటసాల భక్తి రంజని పేరిట సంగీత కచేరి, రాత్రి నగరానికి చెందిన రామాంజనేయ నాట్య మండలి ఆధ్వర్యంలో రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం ప్రదర్శించారు. తొలుత అర్చకులు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదం శెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సమాచార హక్కు కార్యకర్తల సంఘం జిల్లా కన్వీనర్‌గా హరీష్



ఏలూరు (టూటౌన్): సమాచార హక్కు కార్యకర్తల సంఘం ఏలూరు జిల్లా కన్వీనర్‌గా నగరానికి చెందిన వైవీ హరీష్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపకుడు ముత్తు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో సమాచార హక్కు వినియోగం, ఉపయోగాలపై ప్రజలకు తెలియజేయనున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టం అందరికీ తెలిసే విధంగా చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అవినీతిపై అక్రమాలపై ప్రశ్నించే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని చెప్పారు.

ఖాళీలను భర్తీ చేయండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక డెమొక్రటిక్ పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పదోన్నతులు, లేదా సర్దుబాటు ద్వారా భర్తీ చేయాలని కోరారు. గంగాధర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఉదయ్ భాస్కరరావు తదితరులు మాట్లాడారు.

సామూహిక ఎలుకల నివారణతో సత్ఫలితాలు



కొవ్వలిలో ఎలుకల నివారణ మందును రైతులకు అందజేస్తున్న వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ



ఉంగుటూరు ఆర్‌బీకే వద్ద ఎలుకుల నిర్మూలన మందును రైతులకు అందజేస్తున్న ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధు



గుండుగొలను ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులను రాజుగా చూడాలన్న లక్ష్యంతో రైతు సంక్షేమం, అభివృద్ధి దిశగా అనేక పథకాలు అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ అన్నారు. బుధవారం కొవ్వలిలో రైతులకు ఎలుకల నివారణా మందులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి సంతృప్తికరమైన దిగుబడులు, భూసార పరిరక్షణ లక్ష్యంగా చేయాలన్నారు. వ్యవసాయ కళాశాల (రాజమండ్రి) శిక్షణ విద్యార్థులు రైతులకు సామూహిక ఎలుకల నివారణపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వరి నూకలు 96 పాళ్లు, వంటనూనె 2 పాళ్లు, బ్రోమోడైరోమియన్ 0.25సీ.బీ రెండు పాళ్లు నమూనాతో చూసి 25 కేజీల నూకలతో తయారు చేసి పొలంలో ఎలుకల నివారణకు ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, ఏఓ గద్దె రమేష్‌బాబు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పీ.ప్రమీల, పీ.లక్ష్మి, జ్యోతిక, డీ.భావన, ఎం.లక్ష్మిభాయి, డీ. గిరిజా కుమారి ఉన్నారు.

ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. గుండుగొలనులోని సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. 5 కేజీల నూకలు, 100 గ్రాముల నూనె, 100 గ్రాముల బ్రోమోడయలిన్ కలిపిన మందును పొట్లాల రూపంలో రైతులకు అందించారు. మందు వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఏవో ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ దాళ్వా రైతులంతా విధిగా ఈ– పంట నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ-కేవైసీ చేయించుకోని రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, నష్ట పరిహారం, దాళ్వాలో ధాన్యం కొనుగోలు వంటి విషయాల్లో ఇబ్బందులు పడతారన్నారు. మండలంలోని 12,929 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, రైతులంతా ఆర్‌బీకే సిబ్బందికి సహకరించాలని కోరారు. సామూహిక చర్య వల్ల ఎలుకల నివారణ సాధ్యమవుతుందన్నారు. భీమడోలు లింగంపాడు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ సామూహిక ఎలుకల నివారణ మందును ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన మందు పంపిణీ

ఉంగుటూరు: సామూహికంగా ఎలుకల నిర్మూలనకు రైతులు ఐక్యతతో ముందుకు రావాలని ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలంలో సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరులో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధు రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ మాట్లాడుతూ రైతులు ఎలుకల నివారణ మందును ఇళ్ల వద్ద ఉంచవద్దని సూచించారు. సామూహికంగా మందును రైతులు ఉపయోగించాలని కోరారు. పొలం గట్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో ఈ మందును ఎలుకలు బొరియలు వద్ద ఉంచాలని తెలిపారు. మందును కలిపిన ఎరను రైతులకు అన్ని గ్రామాల్లో ఉచితంగా పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు. ఏవో వెంకటేష్ పర్యవేక్షణలో రైతులు మందును చేల గట్ల వెంబడి ఎలుకల బొరియల వద్ద ఉంచారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. నీలాద్రిపురంలో సొసైటీ త్రిమేన్ కమిటీ సభ్యుడు సురే ఏడుకొండలు, సర్పంచి చదలవాడ రాజేంద్రకుమార్ రైతులకు మందు పంపిణీ చేశారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ ఆధునికీకరణ పనులు



పోలసానిపల్లి వద్ద నేషనల్ హైవే క్రాసింగ్ వద్ద విద్యుత్ ఆధునికీకరణ పనులు చేస్తున్న దృశ్యం



ఆధునికీకరణ పనులపై డీఈఈ బి.రామకృష్ణతో చర్చిస్తున్న ఎస్సై చావా సురేష్‌కుమార్

భీమడోలు: భీమడోలు నుంచి కామవరపుకోటకు వెళ్లే విద్యుత్ లైన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా బుధవారం జాతీయ రహదారిపై భీమడోలు మండలం పోలసానిపల్లి హైవే క్రాసింగ్ వద్ద విద్యుత్ లైన్ ఆధునీకరణ పనులను బుధవారం ఉదయం యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సాయంత్రానికి పూర్తి చేసారు. దీనితో జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే భారీ వాహనాలను సంబంధిత అధికారులు భీమడోలు జంక్షన్ మీదుగా మళ్లించారు. సాయంత్రానికి పనులు పూర్తి కావడంతో రహదారిపై యథావిధిగా వాహనాలు రాకపోకలు ప్రారంభమయ్యాయ. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు. భీమడోలు 220 సబ్ స్టేషన్ నుంచి కామవరపుకోటకు 018 కిలోమీటర్ల దూరం విద్యుత్ ఆధునికీకరణ పనులను విద్యుత్ ట్రాన్స్‌కో నిర్మాణ విభాగం అధికారులు చేపట్టారు. ఈ క్రమంలో ఈ విద్యుత్ లైన్ ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు హైవేపై పోలసానిపల్లి వద్ద గల ఆరు వరసల రోడ్డు మీదుగా విద్యుత్ లైన్ వెళ్తుంది. ఈ క్రమంలో రోడ్డు క్రాసింగ్ పనులు చేసేందుకు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు నేషనల్ హైవే ఆథారిటీ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. విద్యుత్ ఆదునికీకరణ పనులను ఏలూరు డీఈఈ బి.రామకృష్ణ పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. క్రేన్ల సాయంతో విద్యుత్ లైన్ ఆధునీకరణ చేపట్టి పూర్తి చేసారు. ఈ పనులు పూర్తయితే నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులు పంపిణీ చేయవచ్చని డీఈఈ బి.రామకృష్ణ తెలిపారు. పోలసానిపల్లి హైవేపై ఇరువైపులా ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగించకుండా పోలీసులు స్టాపర్లను ఏర్పాటు చేసారు. దీనితో ఏలూరు నుంచి రాజమండ్రి, రాజమండ్రి నుంచి ఏలూరుకు తీసు కుని వెళ్లే వాహనాలన్నీ భీమడోలు జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించాయి. దీనితో వాహనాలన్నీ కిలోమీటర్ల మేర క్యూ కట్టాయి. భీమడోలు జంక్షన్ వద్ద వాహనాల రద్దీ ఏర్పడింది. విద్యుత్ ఆధునికీకరణ పనులు సాయంత్రానికి పూర్తి కావడంతో హైవే రాకపోకలను యథావిధిగా పునఃప్రారంభమయ్యాయి.

ప్రయోగాలతో విద్యార్థుల్లో చైతన్యం



ప్రయోగాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

ఉంగుటూరు: హైస్కూలు స్థాయి నుంచి విద్యార్థులకు సైన్సు పట్ల అభిరుచి పెంచేందుకు ప్రయోగాల పరిశీలన అవసరమని ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ డాక్టరు కొండా రవి అన్నారు. బుధవారం నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో ల్యాబ్ టు స్కూలు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కొండా రవి మాట్లాడుతూ విద్యార్థులను నూతన ఆవిష్కరణల వైపు నడిపించాలని అన్నారు. అందువల్లే డిగ్రీ విద్యార్థులు సొంతంగా రూపొందించిన వివిధ ప్రయోగాలను విద్యార్థుల ప్రదర్శన నిమిత్తం నారాయణపురం హైస్కూల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు షేక్‌మీరా సాహెబ్ మాట్లాడుతూ ప్రయోగాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని నింపుతాయని అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. రెడ్డయ్య, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బి. వెంకటేశ్వర రెడ్డి, జంతు శాస్త్ర అధ్యాపకులు బి. రాజు, గణిత శాస్త్ర అధ్యాపకుడు డాక్టరు పి బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించిన నమూనాలను ప్రదర్శించి హైస్కూలు విద్యార్థులకు డిగ్రీ విద్యార్థులు వివరించారు.

గ్రామాల్లో ఆక్వా జోన్ పరిధిపై సర్వే

దెందులూరు: చేపల చెరువుల రైతులకు విద్యుత్ బిల్లు రాయితీ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా జోన్ పరిధిపై సర్వేకు ఆదేశాలు జారీ చేసిందని మత్స్యశాఖ సహాయకురాలు ఎస్.ప్రవల్లిక అన్నారు. బుధవారం పోతునూరులో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపల చెరువులు 10 ఎకరాల్లోపు ఆక్వా జోన్‌లో ఉంటే యూనిట్‌కు 1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తిస్తుందని లేకుంటే రూ.3.80 పైసలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.1.50 పైసలు పవర్ సబ్సిడీ వర్తించేలా ఆక్వా జోన్ పరిధిపై సర్వే చేయాలని మత్స్యశాఖ సహాయకులందరికీ ఆదేశాలు జారీ చేసిందన్నారు. 2018లో ఆక్వాజోన్‌పై సర్వే చేసి పాత చేపల చెరువులను జోన్‌లో పెట్టారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి గెజిట్ సైతం విడుదలైందన్నారు. ప్రభుత్వపరంగా నిబంధనలకు లోబడి వృత్తిపరంగా ఆక్వా రైతులను ప్రోత్సహించడం, రాయితీలు సకాలంలో అమలు, అనుమతులు వేగంగా మంజూరు చేయడం కోసం ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. మత్స్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తోందన్నారు. దెందులూరు మండలంలో 2018లో 2,237 ఎకరాల చేపల చెరువులు జోన్ పరిధిలో ఉన్నాయని సర్వేద్వారా ప్రస్తుతం విస్తృతి పెరిగే అవకాశం ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన ఆక్వా చెరువులను సర్వే పూర్తి చేసి జోన్ పరిధి పెంచేందుకు అనుమతుల కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. త్వరలో చేపల చెరువుల రైతులు రాయితీ పొందేందుకు ఆదేశాలు వెలువడనున్నాయన్నారు. గ్రామాల్లో మత్స్యశాఖ సహాయకులు చేస్తున్న సర్వేను దెందులూరు మండల ఇన్‌చార్జి మత్స్య శాఖాధికారి ఈశ్వర్ పర్యవేక్షిస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఏపీ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ వేణుగోపాలరెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ వేణుగోపాలరెడ్డిని బుధవారం దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వెలగపూడి కార్యాలయంలో కలిశారు. ఏలూరు నుంచి నూజివీడు వరకు రోడ్ల అభివృద్ధికి రూ. 42 కోట్లు నిధులు మంజూరు చేయాలని, ఏలూరు నుంచి కైకలూరు వరకు రోడ్డు నిర్మాణాన్ని ఎన్‌డీబీ ఫేజ్–1లో పెట్టాలని దెందులూరు నుంచి పంగిడిగూడెం రోడ్డులో చల్లచింతలపూడి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి నివేదికను అందజేశారు. నివేదిక పరిశీలించి సమస్య పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వేణుగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వివరించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మాధవి సుకన్యను కలిసి పెదపాడు మండలంలోని వట్లూరులో అండర్ పాస్ నిర్మాణం, పెదవేగి మండలంలో విజయరాయి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణంపై చర్చించారు.

ఎమ్మెల్సీ రఘురాం సతీమణికి నివాళి

దెందులూరు: ఎమ్మెల్సీ, ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘురాం సతీమణి స్వర్ణకుమారి దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ రఘురాంను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్పందన పిటిషన్లపై చర్యలు చేపట్టాలి

పెదపాడు: గ్రామ పంచాయతీల్లో స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని పెదపాడు మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్ సూర్యకుమార్ తెలిపారు. మిషన్ అంత్యోదయ సర్వేడేటా త్వరితగతిన అప్లోడ్ చేయాలన్నారు. గ్రామ స్థాయిలో స్పందన అర్జీని వన్ మినిట్ వీడియో ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. సంబంధిత అర్జీపై తీసుకున్న చర్యలను నమోదుచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఈ విషయంపై అవగాహన అవసరమని తెలిపారు. అర్జీదారులతో సంప్రదించి సంబంధిత విషయాన్ని అప్లోడ్ చేయాలన్నారు. లేకుంటే సంబంధిత అధికారికి మెమోలు వస్తాయని ఈఓఆర్డీ సూర్యకుమార్ అన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పెదవేగి : ఎమ్మెల్సీ ఎన్నికలకి సంబంధించి కోడ్ అమలులో ఉన్నందున సీఈఓ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించాల్సిన పెదవేగి సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తరువాత నిర్వహించే సమావేశ తేదీని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలియజేస్తామని ఎంపీడీఓ చెప్పారు.

నేడు చేపల చెరువు వేలం

పెదపాడు: స్థానిక పశువుల చెరువులో స్వభావికంగా పెరిగిన చేపలను ఒక్కరోజులో పట్టుకునే హక్కుపై వేలం నిర్వహిస్తున్నట్లు పెదపాడు సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి తెలిపారు. పెదపాడులోని పంచాయతీ కార్యాల యం సమీపంలోని పశువుల చెరువులో స్వభావికంగా పెరిగిన చేపలను పట్టుకునే హక్కుపై ఉన్నతాధికారుల అనుమతి మేరకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.1000 దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

ఆంజనేయులకు ఘన సత్కారం



బూరుగుపల్లి ఆంజనేయులు దంపతులను కుమారుడు నాగేంద్రను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: చేబ్రోలు రైల్వేగేటు వద్ద ప్రయాణికుల సమస్య పరిష్కారానికి అండర్ టన్నెల్‌కు సీపీ రహదారి నిర్మించిన బూరుగుపల్లి ఆంజనేయులు దంపతులను, వారి కుమారుడు నాగేంద్రను చేబ్రోలు పాండురంగస్వామి ఆలయం వద్ద యాదవ సంఘ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. రైల్వేగేటు తరుచూ వేయటం వల్ల ప్రయాణికులు ఇక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అండర్ టన్నెల్‌లో సీసీ రహదారి నిర్మించడంతో ప్రయాణానికి ఇబ్బందులు తొలగిపోయాయని యాదవ సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు మాగంటి రంగారావు, దాసిరి నాగరాజు, మాగంటి పోతురాజు, గుడ్ల ఏసు, అత్తిలి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సాయినామ స్మరణతో మార్మోగిన లక్ష్మీపురం



లక్ష్మీపురంలోని సాయిబాబా స్తూపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



సాయిబాబా స్తూపం వద్ద మొక్కు చెల్లిస్తున్న భక్తులు



సత్యనారాయణపురంలో సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెదవేగి : లక్ష్మీపురంలోని సాయిబాబా గార్డెన్స్‌లో సాయిబాబా స్తూపం 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. 26 ఏళ్ల క్రితం సాయిబాబా ఆలయాన్ని ఇక్కడ నిర్మించారు. అనంతరం 100 అడుగుల సాయిబాబా స్తూపం నిర్మించారు. ఈ స్తూపాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు కాలినడకన తరలివచ్చి సాయిబాబా– పాదాలు తాకి ప్రత్యేక పూజలు చేస్తారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి సాయిబాబాను దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పెదవేగి ఎస్సై ఎం. లక్ష్మణ్ తమ సిబ్బందితో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా వార్షికోత్సవం

దెందులూరు: సత్యనారాయణపురంలో బుధవారం సాయిబాబా ఆలయంలో 14వ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు, అర్చకులు సాయిబాబాను వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ, బాబా గీతాలాపన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా అన్నసమారాధన నిర్వహించారు.